సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 31 । జూలై । 2024



నిత్యాన్నదానానికి రూ.20,232


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్న దాన పథకానికి త్సామ వెంకట సుబ్రహ్మణ్యం (కొత్త పేట) రూ.10,116, తెలికపల్లి ఆశిష్ కాశ్యప్ (హైద రాబాద్) రూ.10,116 విరాళంగా అందజేశారు.



అన్నదాన భవనానికి రూ.లక్ష

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి దాడిశెట్టి విష్ణుచక్రం దంపతులు (తుని మండలం ఎస్.అన్న వరం) రూ.1,00,500 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 7,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలు వలకు మంగళవారం 7,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,500 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1,200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

ఒలింపిక్స్ సెల్ఫీ స్టేషన్ ఏర్పాటు



సెల్ఫీ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

అమలాపురం రూరల్: పారిస్‌లో జరుగుతున్న సమ్మర్ ఒలింపిక్స్–2024కు సెల్ఫీ స్టేషన్‌ను కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. దీన్ని ఆగస్టు 11 వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఒలింపిక్స్ క్రీడలపై ప్రజలకు అవగాహన కలి ్పించడం కోసం, భారత క్రీడాకారులకు శుభా కాంక్షలు తెలపడానికి సెల్ఫీ స్టేషన్‌లో ఫ్లెక్సీ స్టాండ్‌లను ఏర్పాటు చేయవలసిందిగా ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశించింద న్నారు. జేసీ టి.నిషాంతి, ఎస్పీ బి.కృష్ణారావు, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఏవో సీహెచ్ వీరాం జనేయ ప్రసాద్, డీఎస్ డీఓ సురేష్‌కుమార్ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంపద సృష్టికి చమురు సంస్థలపై దృష్టి పెట్టరెందుకు?

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ప్రశ్న

అమలాపురం టౌన్: సంపద ఎలా సృష్టించాలో నాకు బాగా తెలుసు అని ఎన్నికల్లో పదే పదే చెప్పుకున్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు చమురు సంస్థల నుంచి సంపదను సృష్టించే అం శంపై ఆలోచించకపోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంతో మిత్రత్వాన్ని సాగిస్తున్న చంద్ర బాబు రాష్ట్రంలో చమురు సంస్థలు దోచుకుం టున్న సహజ సంపదపై ప్రధాని మోదీతో ఇప్ప టికీ చర్చించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదంతా చూస్తుంటే సంపద సృష్టి వట్టి మాటేనని స్పష్టమవుతోందని తెలిపారు. చమురు సంస్థలపై ఇప్పటికైనా దృష్టి పెడితే రాష్ట్రంలో సంపద సృష్టి కోసం అట్టే అన్వేషణలు అవసరం లేదని పేర్కొ న్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవు మండలం నుంచి అటు రిలయన్స్, ఇటు గుజ రాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్‌లు రూ.కోట్ల విలువైన సహజ సంపదను పైపులైన్ల ద్వారా గుజ రాత్ తదితర ఇతర రాష్ట్రాలకు తరలించుకుపోతు న్నాయని ఎమ్మెల్సీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంస్థల నుంచి మన రాష్ట్ర ప్రయోజనాల కోసం సంపద సృష్టించే దిశగా ఆలోచించాలని సూచిం చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, సంపద సృష్టి కోసం అవసరమైతే బీజేపీతో మైత్రీ బంధాన్ని కూడా తెంచుకోవాలన్నారు.

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి గొల్లపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మామిడికుదురు: గోదావరి వరదల వల్ల తీర గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడు తున్నా వారికి కనీసం భోజనం పొట్లాలు కూడా అందించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆవేదన వ్యక్తం చేశారు. వరద తాకిడికి గురైన గ్రామాల్లో పర్యటించిన సందర్భంలో బాధితుల గోడు విని మనసు ఆవేదన చెందిం దన్నారు. వరదలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వద్ద ఏ విధమైన ముందస్తు కార్యా చరణ లేదని మండి పడ్డారు. మామిడికుదు రులో వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్య క్షుడు కటకంశెట్టి ఆదిత్య స్వగృహంలో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే ఊడిమూడిలంకలో చదలవాడ విజయ్‌కృష్ణ గోదావరి నదిలో గల్లంతై మృతి చెందాడ న్నారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో ప్రజ లను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు ఇప్పుడు ఆ పథకాల ఊసెత్తకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తక్షణం అమలు చేయాలని సూర్యారావు డిమాండ్ చేశారు. ఎం తో విజనరీనని చెప్పుకుంటున్న చంద్రబాబు 50 రోజుల్లో రూ.11 వేల కోట్లు అప్పు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సంపద సృ ష్టించడం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ప్రశి ్నస్తానన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడ్డం లేదని గొల్లపల్లి ప్రశ్నించారు. హామీలు అమలు చేసే వరకు వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుం దన్నారు. యూత్ జిల్లా అధ్యక్షుడు సూరిశెట్టి బాబి, పార్టీ నేతలు కొల్లాబత్తుల వెంకటర మణ, సర్కిల్ ముస్తఫా పాల్గొన్నారు.



అంబాజీపేట మండలం వాకలగరువులో నీట మునిగి చనిపోయిన దొండ, బీర పాదులు



టేకిశెట్టిపాలెం ఏటిగట్టు నుంచి అప్పనరామునిలంక పంపేందుకు సిద్ధం చేస్తున్న తాగునీరు, ఫుడ్ ప్యాకెట్లు



పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో వరద నీటిలో వెళుతున్న ప్రజలు



మురమళ్ల శ్మశాన వాటికను వీడని వరద

మెల్లగా తగ్గుముఖం

- లంక గ్రామాలను నెమ్మదిగా వీడుతున్న వరద
- తేరుకుంటున్న లంక వాసులు
- కాజ్‌వేలపై కొనసాగుతున్న ముంపు
- ఇంకా ట్రాక్టర్లు.. పడవల మీదనే ప్రయాణం
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి



సఖినేటిపల్లి లాకుపేటలో పడవలపై ప్రయాణం చేస్తున్న స్థానికులు

సాక్షి అమలాపురం: గోదావరి వరద తగ్గుముఖం పడుతోంది. లంక గ్రామాల్లో ముంపు నెమ్మదిగా వీడుతోంది. ఇళ్లు, పంట పొలాలు చుట్టూ చేరిన వరద నీరు తగ్గుతోంది. గడిచిన పదమూడు రోజు లుగా వరద పెరుగుతూ.. తగ్గుతూ లంక వాసు లను ముప్పుతిప్పలు పెట్టింది. ఎగువన ధవళే శ్వరం వద్ద వరద గణనీయంగా తగ్గుతుండడంతో ఆ ప్రభావం జిల్లాలోని లంక గ్రామాల్లో బుధవారం నుంచి చూపించనుంది. అయితే ముంపు మరో రెం డు రోజులు కొనసాగే అవకాశముంది.

గోదావరికి రెండవ సారి వరద వచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల 28వ తేదీ సాయంత్రం ఆరు గం టల సమయంలో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగు వకు 15,90,761 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 28వ తేదీన 14,74,512 క్యూసెక్కులకు వరద తగ్గింది. 29వ తేదీ సాయంత్రం ఏడు గం టల సమయానికి ఇది కాస్తా 14,27,777ల క్యూసె క్కులకు తగ్గగా, 30వ తేదీ మంగళవారం సాయం త్రం ఏడు గంటల సమయానికి 11,19,425 క్యూసె క్కులకు తగ్గింది. 24 గంటలలో గోదావరి వరద ఏకంగా 3,08,352 క్యూసెక్కుల తగ్గడం విశేషం. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తొలి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. తగ్గుదల ప్రభావం కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచి కనిపించనుంది. కె.గంగవరం మండలం కోటిపల్లి మత్స్యకార కాలనీలో వరద ముంపు వీడింది. వరదకు ఇక్కడ నాలుగు అడుగుల ఎత్తున నీరు చేరింది. ఇళ్లల్లో వరద మొత్తం వీడి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఐ.పోలవరం మండల పరిధిలోని మురమళ్ల, కేశనకుర్రు, గుత్తెనదీవి, ఎదు ర్లంక, పాత ఇంజరం, కొమరిగిరి, పశువుల్లంక గ్రామాల్లో ముంపు చాలా వరకు తగ్గింది. ముంపు బారిన పడిన కేశనకుర్రు పల్లెగూడెం, పొగాకు లం క, అరుంధతినగర్‌లో వరద నీరు తగ్గుతోంది. ఇళ్ల మధ్య నీరు తగ్గుతుండడంతో ఆయా నివాస ప్రాం త వాసులు బురదను వదుల్చుకునే పనిలో పడ్డారు. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నే ల్లంక మత్స్యకార కాలనీతోపాటు గురజాపులంకలో ఇళ్లలో వరద వీడింది. గురజాపులంక వెళ్లే రహదారి మీద వరద తగ్గింది. పంట పొలాలు, తోటల్లో మాత్రమే వరద కొనసాగుతోంది.

అక్విడెక్టు వద్ద..

పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద తగ్గుముఖం పట్టింది. గోదావరి మధ్యనున్న జిల్లాలోని జి.పెద పూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడిలంక, బూరుగులంక, శివాయిలంక పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని పుచ్చల్లంక, కనకాయిలంక, అన గారిలంక గ్రామాలకు పడవల మీదనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కె.ఏనుగుపల్లి, ఎల్.గన్న వరం వంటి గ్రామాలకు వరద నీరు తగ్గడంతో వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. అయినవి ల్లి మండలం ఎదురుబిడియం కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ ఇంకా పడవల మీదనే రాకపోకలు సాగిస్తున్నారు. మామిడికుదురు మం డలం అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీరు ఉంది. అయినప్పటికీ మధ్యాహ్నం నుంచి వరద నీటిలో మోటార్ సైకిళ్ల రాకపోకలు మొదలయ్యాయి. సఖి నేటిపల్లి మండలం అప్పనరామునిలంక, సఖినేటి పల్లిలాకు సెంటరు, సఖినేటిపల్లి రేవుల్లో వరద ఉధృతంగా ఉంది. ఇక్కడ బుధవారం నుంచి తగ్గే అవకాశముంది. అయితే భద్రాచలం వద్ద స్వల్పం గా వరద పెరగడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

దాణా పంపిణీ : కలెక్టర్

జిల్లాలోని లంక గ్రామాలలోని పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించిన నేపథ్యంలో పశుగ్రాసం లభించక పశుపోషకులు ఇబ్బం దులు పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి పశువుకి రోజుకి 5 కేజీల చొప్పున 5 రోజులకు సరిపడా దాణా పంపిణీ చేస్తామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలి పారు. జిల్లా యంత్రాంగం గుర్తించిన 14 మం డలాల్లోని 54 గ్రామాలలో 10,797 పశువులకు ప్రభుత్వం తరఫున ఉచితంగా దాణా పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 275 మెట్రిక్ టన్నుల దాణా పంపిణీ చేస్తామన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్-2ను పరిశీలించిన అధికారులు

నలుగురు ఉద్యోగులకు మెమోలు



రావులపాడు ఇసుక పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ తదితరులు

రావులపాలెం: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ల జగ్గిరెడ్డి సోమవారం రావులపాడు ఇసుక స్టాక్ పాయింట్-2 ను సందర్శించి అక్రమాలను బహిర్గతం చేయడంతో మంగళవారం జిల్లా స్థాయి అధికారులు రావులపాడు ఇసుక పాయింట్ -2 సందర్శించి పరిశీ లించారు. కొత్తపేట ఆర్డీఓ జీవివి సత్యనారాయణ, డీఎస్పీ రమణ, సాట్ అధికారులు, మైనింగ్ అధికా రులు సంయుక్తంగా ఈ పరిశీలన జరిపారు. స్టాక్ పాయింట్-2 వద్ద ఉన్న అధికారులను ఇసుక ఎగు మతి చేస్తున్న పలు అంశాలపై ఆరా తీశారు. ఇసుక ఎగుమతులు జరుగుతున్న విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ లారీ డ్రైవర్లను విచారించి వివరాలను నమోదు చేసుకున్నట్టు తహసీల్దారు డీవీఎ స్ఎస్ అశోక్ వర్మ తెలిపారు. స్టాక్ పాయింట్‌ల లో విధులు నిర్వహిస్తున్న నలుగురు సచివాలయం ఉద్యో గులకు మెమోలు ఇచ్చినట్టు తహసీల్దారు తెలిపారు.

జల దిగ్బంధంలోనే దిండి



దిండిలో లంగరు వేసిన బోట్లు

మలికిపురం: ప్రముఖ పర్యాటక కేంద్రం పది రోజు లుగా జల దిగ్బంధంలోనే ఉంది. గోదావరి నదికి వరద కారణంగా బోట్లకు లంగరు వేసి ఉంచారు. రిసార్ట్ భవనాలలోకి కూడా వరద నీరు రావడంతో ముంపునకు గురైంది. బోట్లు నిలిచిపోవడంతో టూ రిస్ట్ షికారు నిలిచిపోయి సంస్థకు నష్టం ఏర్పడింది.

స్థానికులకు ఓఎన్‌జీసీ ఉపాధి కల్పించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: సహజ వాయువుల నిక్షేపాలు బయటకు తీస్తున్న ప్రాంతాలలో నైపుణ్యం అవసరం లేని పనులు అప్పగించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచిం చారు. మంగళవారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో చమురు సహజ వాయువుల సంస్థ (ఓఎన్‌జీసీ) తూర్పు ప్రాంత ఆఫ్ షోర్ ఎసెట్ కాకినాడ ప్రతిని ధులు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి జిల్లా పం చాయతీ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహిం చారు. ఓడలరేవులో 300 ఎకరాల విస్తీర్ణంలోగల ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాల గురించి ప్రతినిధు లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలో 42 గ్రామాలు ఉన్నాయని ప్రాజెక్టు మూలంగా పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయా అన్న కోణంలో సర్వే చేపట్టాలన్నారు. నెల ముందుగా నోటీసులు జారీ చేస్తూ ప్రజాభిప్రాయ సేకరణ సమా వేశాలు నిర్వహించాలన్నారు. ప్రజలు లేవనెత్తిన ప్రతి అంశంపై స్పష్టతను ఇవ్వాలని ఆదేశించారు. పర్యా వరణ పరంగా ఒక ఏజెన్సీని ఏర్పాటు చేసి ప్రతి ఏడాది అధ్యయనం చేస్తూ ప్రాజెక్టు నిర్వహణ మూలంగా ఏ విధమైన హాని కర పరిస్థితులు లేవని ధ్రువీకరించాలన్నారు. భూసార స్థితిగతులను ఎప్పటి కప్పుడు ఎనిమిది పారామీటర్లలో విశ్లేషించాలని ఆయన ప్రతినిధులకు స్పష్టం చేశారు. గ్రామాలలో సీఎస్‌ఆర్ ద్వారా విద్య,వైద్య,మౌలిక సదుపాయాల మెరుగుదలకు నిధులు కేటాయించాలని సూచిం చారు. సీజీఎం మెకానికల్ నిర్మల్‌కుమార్, హెడ్‌హెచ్ ఎస్‌సీ మేనేజర్ భాస్కరరావు, ప్రొడక్షన్ జనరల్ మేనే జర్ ఎ.గుప్తా, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ సందీప్‌రెడ్డి, జిల్లా పం చాయతీ అధికారి డి.రాంబాబు పాల్గొన్నారు.

కొత్తగా స్వాతంత్య్ర దినోత్సవం

స్వాతంత్య్ర దినోత్సవాన్ని నూతన ఒరవడికి నాంది పలుకుతూ నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కలె క్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులకు సూచించారు. ఆగస్టు 15 నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సన్నద్ధ అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహ ణలో గేయ, నృత్య రూపకాలు కాకుండా స్వాతంత్ర ఉద్యమం ఉద్యమ ఘటనలు, సన్నివేశాలు తెలిపే అం శాలపై నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. జాతీయ పతాక ఆవిష్కరణ, జెండా వందనం, పోలీసుల కవాతు, గౌరవం వందనం స్టేజ్ ఏర్పాట్లు, వివిధ గ్యాలరీల ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జాతీయ పతాక ఆవిష్క రణ జెండా వందన ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాటు చేపట్టాలని అన్నారు. ఆర్డీవో రైన్ ప్రూఫ్ టెం టులను జీఎంసి బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేయాలన్నారు. ఆగస్టు మొదటి వారంలో నిర్వహించే సమీక్షలో ఏ శాఖలకు చెందిన శకటాలు ఏర్పాటు చేయాలన్న అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామ న్నారు.

చెత్తను వదిలించుకోవడానికి కార్యాచరణ

పురపాలక సంఘాలలో డంపింగ్ యార్డులలో చెత్తను ఏ రకంగా వదిలించుకోవాలనే దానిపై జిల్లా మొత్తం ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొం దించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మున్సి పల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా గ్రామపంచాయతీల అధికారులు, పుర పాలక సంఘాల కమిషనర్లు టౌన్ ప్లానింగ్, శాని టేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి 15 ఆర్థిక సంఘం నిధులు అమృత్ 2.0 నిధులు విని యోగం, చెత్త చెదారాల రీసైక్లింగ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై సమీక్షించారు. పురపాలక సంఘ కమిషనర్లు ఎస్. మనోహర్, టి.వెంకటరామిరెడ్డి డీపీవో డి.రాంబాబు పాల్గొన్నారు.

తొలి రోజే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పం పిణీ ఆగస్టు1వ తేదీనే పూర్తి చేయాలని ఎంపీడీవో లను కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. కలె క్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పింఛన్ల పంపి ణీపై సమీక్షించారు. 28 కేటగిరీలలో 2,43,402 మందికి గాను రూ. 101 కోట్ల 30 లక్షల పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో 4,258 మంది సిబ్బంది పంపిణీ చేస్తారన్నారు.

ముంపు సమస్య పరిష్కరించాలని రైతుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం రూరల్: వరి పంట ముంపు బారిన పడి ఏటా కోట్లాది రూపాయల విలువ చేసే పం టలు నష్ట పోతున్నామని కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం రైతులు ధర్నా చేశారు. అల్లవరం మండలం రామేశ్వరం, ఉప్పలగుప్తం మండలం కూనవరం మొగల మీదుగా 40 వేల ఎకరాల ఆయకట్టు ముం పునీరు దిగకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోనసీమలో కాట్రేని కోన వృద్ధగౌతమి నదీపాయల నుంచి, అల్లవరం మండలం వైనతేయ నదీపాయ వరకూ సుమారు 6 వేల ఎకరాల్లో పర్ర భూములు (స్వాంప్) ఉన్నాయి. మధ్యడెల్టాలో 1.72 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంటే కొద్దిపాటి వర్షానికి ముంపునకు గుర వుతున్నాయని రైతులు తెలిపారు. భారీవర్షాల సమ యంలో ముంపునీరు రామేశ్వరం, కూనవరం డ్రైన్ల నుంచి పర్రభూముల్లోకి వెళుతుందని, అయితే ఆక్రమణల వల్ల ముంపు సమస్య వస్తోందన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లా డుతూ ముంపు నీరు దిగే రామేశ్వరం కూనవరం మొగ వద్ద ఏర్పడిన ఇసుకమేటలను వెంటనే తొల గించాలని కోరారు. కోనసీమ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షుడు యాళ్ళ బ్రహ్మానందం మాట్లాడుతూ సాగునీరు అందుబాటులో ముంపు వల్ల ఉన్న ఖరీఫ్ పంటకు సాగుకు రైతులు దూరంగా ఉంటామ న్నారు. వేలాది ఎకరాల్లో పంట నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. రైతు పరిరక్షణ సమితి నాయకులు రాంబాల బోస్, అయితాబత్తుల ఉమామహేశ్వర రావు, బోణం సత్తిబాబు, రంకి రెడ్డి శ్రీనివాసరావు, ఆకేటి బాబులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కించపరిస్తే ఊరుకోం



ఆనంద్ సాగర్ వైఖరిపై నిరసన తెలిపిన జనసేన నాయకులు

టీడీపీ నేత తీరుపై జనసేన పార్టీ నాయకుల నిరసన

అయినవిల్లి: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కించప రిస్తే ఊరుకోబోమని పి.గన్నవరం నియోజక వర్గ జన సేన పార్టీ సమన్వయ కర్త మద్దా చంటిబాబు హెచ్చ రించారు. మంగళవారం చంటిబాబు స్థానిక విలేక రులతో మాట్లాడుతూ పి.గన్నవరం నియోజక వర్గ టీడీపీ కో కన్వీనర్ మోకా ఆనంద్‌సాగర్ మాటలు స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను, జనసేన పార్టీనాయకులను కించ పరిచేవిధంగా ఉన్నాయ న్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఉండగా వర దల్లో తాను చెప్పిన విధంగానే వరద బాధితులకు సాయం అందిందని మోకా ఆనందసాగర్ చెప్పుకుం టున్నారన్నారు. ఈ మాటలు తమను బాధించాయని చంటిబాబు అన్నారు. అత్యధిక ఓట్లతో ఎమ్మెల్యేగా గెలుపొందిన సత్యనారాయణను, జనసేన పార్టీ నాయకులను టీడీపీ నాయకులు కించ పరిస్తే ఊరుకో మన్నారు. మోకా ఆనంద్‌సాగర్ మాటలు ఏన్డీఏ కూటమిని విచ్ఛిన్నం చేసేలా ఉన్నాయన్నారు. ఎమ్మె ల్యేను రాజకీయంగా విమర్శిస్తున్నారన్నారు. ఇటువం టి చర్యలతో మోకా ఆనంద్‌సాగర్ ప్రజలకు వేరే సంకే తాలను ఇస్తున్నారని మండిపడ్డారు. తోలేటి ఉమా, గోన్నూరి అన్నవరం, పినిపే ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, రాంబాబు, గిరి పాల్గొన్నారు.

మల్లిడి సిస్టర్స్ రికార్డుల మోత



మల్లిడి సిస్టర్స్ సాధించిన ఆరు ప్రపంచ రికార్డులతో హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

రాయవరం: ఆ అక్కా చెల్లెళ్ల ప్రతిభను గుర్తించిన పలు సంస్థలు రికార్డులతో సత్కరించాయి. స్థానిక శ్రీ రామయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశా లకు చెందిన మల్లిడి స్వర్ణలత, బాలసాయివైష్ణవి అవయవ దానం ప్రాధాన్యంపై ప్రజలకు అవగా హన కల్పించే ప్రయత్నం చేశారు. 30 రోజులు కష్ట పడి 1,50,330 అగ్గిపుల్లలను ఉపయోగించి 13 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తుతో అవయవ దానం ప్రాధాన్యం తెలియజేస్తూ కార్డు బోర్డుపై ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ఈ ప్రాజెక్టును గత జూన్‌లో యోగా డే రోజున పాఠ శాలలో డీవైఈవో శ్రీపాద నరసింహ ఫణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. విద్యార్థినులు సాధిం చిన ఘనతను వివిధ సంస్థలకు తెలియజేయగా, 15 రోజుల వ్యవధిలో ఈ ప్రాజెక్టుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియా రికార్డ్, మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్, ఫెంటాస్టిక్ ఎచీవ్‌మెంట్ రికార్డ్స్, మార్వ లెస్ బుక్ ఆఫ్ రికార్డ్, హై రేంజ్ బుక్ ఆఫ్ ఓల్డ్ రికార్డ్ తదితర ఆరు వరల్డ్ రికార్డులను చిన్నారులు కైవసం చేసుకున్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు ఆరు ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్న మల్లిడి స్వర్ణలత, బాలసాయి వైష్ణవిలను, వారికి తర్ఫీదునిచ్చిన డ్రాయింగ్ టీచర్ సత్యానందం, తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, నాగిరెడ్డిలను సత్కరించారు. బాల సాయి శ్రీవైష్ణవి పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువు తుండగా, స్వర్ణలత ఇదే పాఠశాలలో చదివి ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ చదువుతోంది.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన పశ్చిమ బెంగాల్ యువకుడు సహిదుల్ షేక్

కరప: 132/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేస్తుండగా పశ్చిమ బెంగాల్ యువకుడు సహిదుల్ షేక్(16) మృతిచెందిన ఘటన కరప మండలం అరట్లకట్ట సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్డా జిల్లా మహేష్ బతాని గ్రామం నుంచి సహిదుల్ హక్, జియాహుల్ హక్ మరికొంత మంది విద్యుత్‌శాఖకు సంబంధించి 132/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేయడానికి వచ్చారు. అరట్లకట్ట సమీపంలో అక్కడక్కడా ఉన్న నాలుగు విద్యుత్ టవర్లలో రెండు టవర్లపై మంగళవారం ఒక్కొక్క టవర్‌పై ముగ్గురు వంతున పని ప్రారంభించారు. ఒక టవర్ నుంచి మరొక టవర్‌కు ఎర్త్ వైరు లాగుతుండగా అకస్మాత్తుగా విద్యుత్ ఇండక్షన్ రావడంతో టవర్‌పైనుంచి ఎర్త్‌వైరును కిందికి వదిలేశారు. అదే సమయంలో కింద పనిచేస్తున్న సహిదుల్ షేక్ పై అది పడింది. బురదనీటిలో ఉండటంవల్ల విద్యుదాఘాతం సంభవించి అతను మృతిచెందాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మరొకతనికి తీవ్రగాయాలవ్వగా కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కరప ఎస్ఐ టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు.. అధిగమిస్తే సొంపు

- వరద నీటి నుంచి పంటలను సంరక్షించుకోవాలి
- కనీస జాగ్రత్తలు తీసుకుంటే ఉద్యాన పంటలకు మేలు
- కూరగాయల సాగుకు సస్యరక్షణ చర్యలు ముఖ్యం

అలమూరు: వర్షాకాలం సీజన్‌లో ఏటా గోదావరికి వరద పోటెత్తుతూ ఉంటుంది. వరద తీవ్రతను బట్టి ఉద్యాన పంటలు మునిగిపోతూ ఉంటాయి. ఉద్యాన పంటల్లోకి వరద ప్రవేశించిన వెంటనే కొద్దిరోజులకే వరద నీరు వెళ్లిపోతే ఆ భూముల్లో సారం పెరుగుతుంది. అదే వరద నీరు రోజుల తరబడి ఉంటే వాణిజ్య, కూరగాయ, పూలతోటలకు వివిధ రకాల తెగుళ్లు సోకడంతో పాటు మొక్కలు కుళ్లిపోయి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. వరద తీవ్రత తగ్గిన వెంటనే రైతులు అప్రమత్తమై ఉద్యానశాఖ సూచనలు, సలహాల మేరకు నష్ట నివారణ చర్యలు తీసుకుంటే ఆ పరిస్థితిని అధిగమించవచ్చు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అన్ని మండలాలు గోదావరి తీర ప్రాంతాలతో పాటు ప్రస్తుత తూర్పు గోదావరి జిలాల్లో లంక ప్రాంతాలైన సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, కొవ్వూరు, నిడదవోలు తదితర మండలాల్లో సుమారు 3.75 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరుగుతోంది. అందులో 2.5 లక్షల వరకూ గోదావరి పాయలైన గౌతమీ, వశిష్ట, వైనతేయ నదీతీరాల వెంబడి ఉన్న


వంగ తోటలో ఆశించిన మొవ్వు తొలుచు పురుగు తెగులు

గ్రామాల్లో రైతులు వివిధ రకాల ఉద్యాన పంటలను పండిస్తుంటారు. వరదల సమయంలో సాగు చేస్తున్న ఉద్యాన పంటలకు సమగ్రమైన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే పంటలు నష్టపోకుండా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.

రైతులు పాటించాల్సిన పద్ధతులు

- వరద నీటిలో చిక్కుకున్న కూరగాయ, వాణిజ్య, పూలతోటలకు సోకే వివిధ రకాల తెగుళ్లను సస్యరక్షణ చర్యల ద్వారా నివారించాలి.
- పంట భూముల్లోకి ప్రవేశించే వరద నీరు బయటకు పోయే విధంగా భూమి వాలును అనుసరించి పొలాల్లో అరడగు వెడల్పు గల కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.
- వరద నీరు ఇంకిపోయిన తరువాత పూర్తిస్థాయిలో నేలను పొడిగా ఆరనివ్వాలి.


కూరగాయల తోటలో వరద నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన కాలువ (పాత చిత్రం)

- వరద నీరు ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంటే జింక్, పొటాష్, నత్రజని పోషకాలతో పాటు ఇనుము ధాతు లోపం ఏర్పడుతుంది.
- ఇనుము ధాతులోపం నివారణకు 0.2 శాతం ఫెర్రస్ సల్ఫేట్‌ను, పొటాష్, నత్రజని లోపాల నివారణకు 1.0 శాతం పొటాష్ నైట్రేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

దొండ సాగుపై ప్రత్యేక శ్రద్ధ

వరదల సమయంలో దొండ సాగు పట్ల ఉద్యాన రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సాధారణంగా వరద నీరు నిల్వ ఉండటం వల్ల దొండ పాదుల్లో చల్లని వాతావరణం ఏర్పడుతుంది. దీనివల్ల ముఖ్యంగా బూజు తెగులు, బూడిద తెగులు ఆశించే ప్రమాదముంది. బూజు తెగులు నివారణకు మాంకోజెల్ లేదా మెటాలాక్సిల్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు ట్రి డీమార్ఫ్ లేదా డైనోకాప్ ఒక మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కూరగాయ తోటల్లో తెగుళ్లు–నివారణ చర్యలు

- కూరగాయ తోటలకు వరదల సమయాల్లో సాధారణంగా సంభవించే రసం పీల్చే పురుగుల నివారణకు 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ లేదా ప్రొఫెనోపాస్ మందును, లేక 3.మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- టమాట సాగులో తరచూ సంభవించే ఆకుముడత తెగులు నివారణకు టెబ్యుకోనజోర్ 2 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాయ కుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ ఒక గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వంగసాగును పట్టి పీడించే మొవ్వు కుళ్లు, కాండం తొలుచు పురుగు నివారణకు మూడు గ్రాముల కార్బరిల్ మందును లేదా 2 మిల్లీలీటర్ల ప్రొఫెనోపాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక గ్రాము కార్బన్‌డైజమ్ లేదా రెండు గ్రాముల కార్బన్‌డైజమ్‌తో పాటు మాంకోజెబ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



వరదలు సంభవించే సమయంలో ఉద్యాన రైతులు ఆందోళన చెందకుండా సస్యరక్షణ చర్యలు చేపడితే కూరగాయల సాగుకు ఏవిధమైన నష్టం వాటిల్లదు. వరద తీవ్రత తగ్గిన వెంటనే ముంపునీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. వరదల ప్రభావంతో సంభవించే తెగుళ్ల నివారణకు సత్వరమే ఉద్యానశాఖను సంప్రదించాలి. – డీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, అమలాపురం

ఉద్యాన రైతులకు అవగాహన



వరద ముంపునకు గురైన వాణిజ్య, కూరగాయ, పూలతోటలను సంరక్షించేందుకు వీలుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై లంక గ్రామాల్లో విరివిగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం. వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే ఉద్యానశాఖ సూచనల మేరకు రైతులు నష్ట నివారణ చర్యలు చేపట్టాలి. – జి.కోటేశ్వరరావు, డివిజన్ ఉద్యానశాఖ అధికారి, కొత్తపేట

మద్యం తాగి బైక్ నడిపిన 22 మందికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో 22 మందికి రెండురోజులు జైలు శిక్ష, 26 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే మద్యం సేవించి బైక్‌పై కాకినాడలో వివిధ ప్రాంతాలలో పలువురు వెళ్తుండగా ట్రాఫిక్ 1, 2 విభాగ సీఐలు ఎన్.రమేష్, చైతన్యకృష్ణ కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా 22 మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు శిక్ష, 26 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో...

మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఇద్దరికి రెండురోజులు జైలు శిక్ష, ఆరుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్. వీరభద్రుడు మంగళవారం తీర్పు చెప్పారు. కాకినాడ వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో, తాళ్లరేవు మండలం కోరంగి పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి బైక్‌పై వెళ్తుండగా పోలీసులు కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జంప్ రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ


జంప్ రోప్ స్కిప్పింగ్ క్రీడల్లో తృతీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

అల్లవరం: నంద్యాలలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్ రోప్ స్కిప్పింగ్ క్రీడల్లో అల్లవరం మండలం గోడి బాలుర గురుకులం విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పోటీల్లో పాల్గొని పాఠశాలకు వచ్చిన ఎనిమిదో తరగతి విద్యార్థులు వీరభద్రరావు, సిద్ధార్థలకు గురుకులంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఇబ్రహీం, పీడీ వి.నానిబాబు, పీఈటీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు విజేతలను అభినందించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం వెలికితీత


విజయకృష్ణ మృతదేహాన్ని వెలికితీస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

పి.గన్నవరం: ఊడిమూడిలంక వద్ద వైనతేయ నదిలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన యువకుడు చదలవాడ విజయకృష్ణ (27) మృతదేహాన్ని పి.గన్నవరం అక్విడెక్టు వద్ద మంగళవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వెలికితీశాయి. గత ఆదివారం ఉదయం మండలంలోని వరద ప్రభావిత లంక గ్రామాలకు ఉచ్చులవారిపేట ఏటిగట్టు నుంచి మంచినీటి ప్యాకెట్ల బస్తాలు తరలిస్తున్న పడవ అదుపు తప్పి బోల్తా పడిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో విజయకృష్ణ గల్లంతు కాగా, వరద ఉధృతిలో కొట్టుకుపోయిన మరో ఐదుగురిని రెండు పడవల్లో వెళ్లి రక్షించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధి టీహెచ్.బెటెన్ సింగ్ నేతృత్వంలో 24 మంది సిబ్బంది నాలుగు బోట్లతో గాలింపు చర్యలు నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. అక్విడెక్టు వద్ద మృతదేహాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తహసీల్దార్ షేక్ హుస్సేన్, సీఐ ప్రశాంతకుమార్ పరిశీలించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

- రాష్ట్ర స్థాయి, ఎన్ఎఫ్‌టీడబ్ల్యూ, ఫెలో టీచర్ కేటగిరీల్లో ఎంపిక
- ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం

రాయవరం: వివిధ ప్రభుత్వ యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ, ఎస్ఎఫ్‌టీడబ్ల్యు, ఫెలో టీచర్ కేటగిరీల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, డైట్, సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 2024 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు కనీసం 15 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని ఉండాలి. ఏ విధమైన క్రమశిక్షణ చర్యలకు గురికానివారు, క్రిమినల్ కేసులు లేనివారు మాత్రమే అవార్డుకు అర్హులు. ఆగస్టు 5వ తేదీలోగా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. మండల, డివిజన్ స్థాయిల్లో కమిటీలు ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తాయి.

వివిధ స్థాయిల్లో కమిటీలు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మండల స్థాయిలో ఎంఈవో చైర్మన్‌గా, ఎంఈవో–2 వైస్ చైర్మన్‌గా, సభ్యులుగా స్థానిక హెచ్‌ఎం, డైట్ లెక్చరర్/మండలానికి చెందని మరొక హెచ్‌ఎం సభ్యులుగా ఉంటారు. మండలంలోని ఎంఈవో పరిధిలోని ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ఒకరిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు వారు పనితీరు ఆధారంగా మార్కులను కేటాయిస్తారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయుల జాబితాను ఎంఈవోలు జిల్లా విద్యాశాఖాధికారికి అందజేయాల్సి ఉంటుంది. డివిజనల్ స్థాయిలో డీవైఈవో చైర్మన్‌గా, మరో ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.

జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్, ఎమినెంట్ ఎడ్యుకేషనలిస్ట్, కలెక్టర్ ఎంపిక చేసిన మరో జిల్లా స్థాయి అధికారితో కమిటీ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తుంది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు కూడా జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు. అసంపూర్తిగా ఉన్న, ఫొటోలు లేని, ఆలస్యంగా సమర్పించే దరఖాస్తులు పరిశీలనలోనికి తీసుకోరు.



ముఖ్యమైన తేదీలు

- రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఎస్ఎఫ్‌టీడబ్ల్యు, ఫెలో టీచర్ అవార్డుల దరఖాస్తులకు తుది గడువు: ఆగస్టు–5
- మండల స్థాయిలో దరఖాస్తుల స్క్రూటినీ: ఆగస్టు–6
- మండల స్థాయిలో దరఖాస్తులను డీఈవోకు అందజేయాల్సిన తుది గడువు: ఆగస్టు–7
- డివిజనల్ స్థాయిలో దరఖాస్తుల పరిశీలన, ఎంపికకు తది గడువు: ఆగస్టు–9
- డివిజనల్ స్థాయి దరఖాస్తులు డీఈవోకు సబ్మిషన్: ఆగస్టు–10
- జిల్లా స్థాయిలో దరఖాస్తుల పరిశీలన, ఫైనలైజేషన్: ఆగస్టు16
- జిల్లా స్థాయి నుంచి పాఠశాల విద్యాశాఖకు ఫైనల్ జాబితా సబ్మిషన్: ఆగస్టు–17
- రాష్ట్ర కమిటీ ఫైనల్ జాబితా ప్రకటన: ఆగస్టు–24

1. హైస్కూల్ హెచ్‌ఎం 2. స్కూల్ అసిస్టెంట్స్ ఇన్ హైస్కూల్స్ (అన్ని సబ్జెక్టులను కలిపి ఉపాధ్యాయుడు మాత్రమే). 3. ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎం 4. ప్రైమరీ, యూపీ స్కూల్స్‌లో ఎస్‌జీటీ 5. హైస్కూల్స్‌లో డ్రాయింగ్ టీచర్స్ 6. హైస్కూల్స్‌లో క్రాఫ్ట్ టీచర్స్ 7. హైస్కూల్స్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ 8. హైస్కూల్స్‌లో మ్యూజిక్ టీచర్స్.. తదితర 20 కేటగిరీల్లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

మార్గదర్శకాలు ఇవీ..

పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అర్హులు కారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు కూడా దరఖాస్తుకు అర్హత కలిగి ఉంటారు. గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి. డైట్ లెక్చరర్లు, మండల విద్యాశాఖాధికారులు, ఇతర తనిఖీ అధికారులు దరఖాస్తుకు అనర్హులు. అర్హులైన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారి దరఖాస్తులను ఎంఈవోలకు సమర్పించాలి. డివిజన్ల స్థాయిలో డీవైఈవోతో కూడిన కమిటీ పరిశీలన చేస్తుంది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ప్రతిపాదన చేసే ఉపాధ్యాయులకు సంబంధించి పదిలైన్లకు మించకుండా పరిశీలనాధికారి రాయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో మోసాలు

- అమలాపురంలో ఐదుగురు నిందితుల అరెస్ట్
- వీరి నుంచి 5 ల్యాప్‌టాప్‌లు, 75 స్మార్ట్ ఫోన్లు, బ్యాంక్‌బుక్‌లు, ఏటీఎం కార్డుల స్వాధీనం
- భీమవరానికి చెందిన ఇద్దరు సూత్రధారుల కోసం గాలింపు

అమలాపురం టౌన్: ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో క్రికెట్ తదితర గేమ్‌ల పేరుతో మోసం చేస్తున్న ఓ ముఠాను అమలాపురం పట్టణ పోలీసులు ఆకస్మిక దాడితో పట్టుకున్నారు. అమలాపురం పట్టణం ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న ఓ లాడ్జిలో ఐదుగురు వ్యక్తులు ఆన్‌లైన్ బెట్టింగులతో ఫోన్లు, మెసేజ్‌ల ద్వారా పలువురి బ్యాంక్ ఖాతాదారులకు వల పన్నుతున్న సమయంలో పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్, క్రైమ్ సీఐ అబ్దుల్ సలామ్‌ల ఆధ్వర్యంలో క్రైమ్ పోలీసుల బృందం సోమవారం మధ్యాహ్నం మాటు వేసి ఆ ముఠాలోని ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించింది. తీగ లాగితే డొంక కదిలినట్టు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఇద్దరి కీలక వ్యక్తుల ఆధ్వర్యంలో ఈ ముఠా నడుస్తోందని దర్యాప్తులో గుర్తించారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరపరిచారు. అజ్ఞాతంలో ఉన్న ఇద్దరి కీలక సూత్రధారుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. లాడ్జిలో పట్టుబడ్డ ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా సభ్యులైన ఐదుగురు నిందితులు అమలాపురం రూరల్ మండలం భట్లపాలేనికి చెందిన మోటూరి దొర సత్య సూర్య మణికంఠ, మోటూరి మధు పవన్, కృష్ణా జిల్లా కైకలూరు మసీద్ రోడ్డుకు చెందిన భలే ప్రవీణ్ బాబు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన పంజా సాయి నరసింహ, గురజాపు సూర్య ప్రభులను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పట్టణ సీఐ క్రిష్టోఫర్ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, సిమ్ కార్డులు, ఏటీఎం కార్డులతో సీఐలు క్రిష్టోఫర్, అబ్దుల్ సలామ్, క్రైమ్ పోలీసులు

వీరి వద్ద నుంచి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అయిదు ల్యాప్ టాప్‌లు, 75 స్మార్ట్ ఫోన్లు, 15 సిమ్ కార్డులు, 19 బ్యాంక్ బుక్‌లు, 25 ఏటీఎం కార్డులు, 7 నోట్ బుక్‌లు, ఒక వైఫై రూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పోలీసులు దాడి చేస్తున్న సమయంలో ఈ ముఠా ఆన్‌లైన్ ద్వారా పలువురిని మోసం చేసే ప్రక్రియలో ఉందని తెలిపారు. సూత్రధారులైన ఇద్దరూ కూడా పట్టుబడితే ఈ ముఠా ఆన్‌లైన్ గేమ్‌ల మోసాలు మరింత వెలుగు చూస్తాయన్నారు. స్వాధీనం చేసుకున్న 75 స్మార్ట్ ఫోన్లలో గూగుల్ ప్లే స్టోర్‌లోని కొన్ని యాప్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ యాప్‌ల ద్వారా పలువురి వాట్సాప్ లింక్ ఆధారంగా వారి గ్రూపుల్లోకి ప్రవేశించి బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ యాప్‌లను తక్షణమే తొలగించాలని, బాధ్యులపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గూగుల్ సంస్థకు లేఖ రాసినట్లు సీఐ క్రిష్టోఫర్ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాను చాకచక్యంగా పట్టుకోవడంలో క్రైమ్ ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు రాజు, రమణ, కానిస్టేబుళ్లు ప్రసాద్, సాయి, హరి, ప్రసాద్ చొరవ చూపారు. పట్టణ పోలీసులు, క్రైమ్ పోలీసులను జిల్లా ఎస్పీ కార్యాలయం అభినందించింది.

3,4 తేదీల్లో వైద్య, విజ్ఞాన సదస్సు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 3,4 తేదీల్లో దక్షణాది రాష్ట్రాల వైద్యులకు వైద్య విజ్ఞాన సదస్సు జరుగుతుందని అమలాపురానికి చెందిన సీజీపీ డైరెక్టర్, సదస్సు నిర్వహణ కమిటీ ప్రతినిధి డాక్టర్ పీఎస్ శర్మ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఉన్న కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్స్ ఏపీ శాఖ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తామన్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది వైద్య ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. వైద్యరంగంలో వచ్చిన ఆధునిక ప్రక్రియలు, వైద్యులపై జరుగుతున్న దాడులు తదితర అంశాలపై సదస్సులో చర్చిస్తామని తెలిపారు. ఆయా వైద్య విభాగాల్లో నిష్ణాతులైన వైద్య నిపుణులు ఆయా వైద్య విభాగంపై చర్చిస్తారని పేర్కొన్నారు. సదస్సు నిర్వహణ కమిటీ కార్యదర్శి డాక్టర్ సోమనాథ్‌దాస్ పర్యవేక్షణలో సదస్సు జరుగుతుందని వివరించారు.

గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు


పి.గన్నవరం ప్రధాన పంటకాలువలో సాగుతున్న గాలింపు

సఖినేటిపల్లి: టేకిశెట్టిపాలెం ఎత్తు వంతెనకు సమీపంలో సోమవారం గల్లంతైన సఖినేటిపల్లికి చెందిన చీర్ల దుర్గారావు ఆచూకీ కోసం మంగళవారం పి.గన్నవరం ప్రధాన పంటకాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. టేకిశెట్టిపాలెం లిమిట్స్ నుంచి సఖినేటిపల్లి లాకుల వరకూ పి.గన్నవరం ప్రధాన పంట కాలువ పొడవునా ఈ గాలింపు జరుగుతోంది.